సాగర తీరం బస్టాప్ ఆధునికీకరణ

- రూ.16 లక్షలతో శరవేగంగా పనులు
- నెలల రోజుల్లో అందుబాటులోకి..


ఆర్కేబీచ్ వద్ద సాగుతున్న స్మార్ట్ బస్‌స్టాప్ పనులు

బీచ్ రోడ్డు: పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విశాఖ తీరాన్ని జీవీఎంసీ ఎప్పటికప్పుడు మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సోలార్ విద్యుత్ లైట్లు, సోలార్ ట్రీ, భూగర్భ విద్యుత్ లైన్లు, డిజిటల్ ప్రకటనలకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసింది. సందర్శకుల సౌకర్యార్థం వైఎంసీఏ వద్ద ఆధునిక స్థాయిలో మరుగుదొడ్లు కూడా నిర్మించింది. ఇప్పుడు తీరాన్ని మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఆర్కేబీచ్ వద్ద బస్టాప్ ఆధునికీకరణ పనులు చేపట్టింది.

➡ సాగరతీరం అభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ రూ.16 లక్షల వ్యయంతో ఆర్కే బీచ్ వద్ద స్మార్ట్ బస్టాప్ నిర్మాణం చేపట్టింది. ఏయూ గేటు వద్ద తొలి స్మార్ట్ బస్టాప్‌ను నిర్మించి అందరి మన్ననలు పొందిన జీవీఎంసీ.. నగరంలో అతి పెద్ద స్మార్ట్ బస్టాప్‌ను ఆర్కేబీచ్ వద్ద నిర్మిస్తుంది. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

➡ స్మార్ట్ బస్టాప్ నిర్మాణం కోసం ఇప్పటికే ఇక్కడున్న పాత బస్టాప్‌ను కూల్చివేశారు. స్మార్ట్ బస్టాప్ నిర్మాణం కోసం కాంక్రీట్‌తో బీమ్‌ల నిర్మాణం ప్రారంభించారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తి చేసి సందర్శకులకు ఈ బస్టాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

ఆరిలోవ అభివృద్ధికి కృషి


ఆరిలోవలో జీవీఎంసీ కల్యాణ మండపం పనులు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్


16వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో కమిషనర్ సాయికాంత్ వర్మతో కలసి ఆమె బుధవారం పర్యటించారు. బాలాజీనగర్, దుర్గాలమ్మ గుడి ప్రాంతాలతో పాటు పెదగదిలి, శ్రీకాంత్‌నగర్ పరిసరాలను పరిశీలించారు. దుర్గాలమ్మ గుడి వద్ద జీవీఎంసీకి చెందిన పాత కల్యాణ మండపాన్ని తొలగించి పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు పరిశీలించారు. అనంతరం వీధుల్లో పారిశుధ్యం, కాలువలు, రోడ్లు తదితర సమస్యల గురించి కమిషనర్‌తో మేయర్ చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆరిలోవ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కమిషనర్‌ను కోరారు. బాలాజీనగర్‌లో దుకాణాలను క్రమబద్ధీకరించాలన్నారు. కల్యాణ మండపం పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ ఆయా పనులకు సంబంధించిన వ్యవహారాన్ని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డీడీహెచ్ దామోదర్‌రావు, రెండో జోన్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, ఏఈ అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో మేయర్, కమిషనర్ పర్యటన

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తామని, ప్రధాన సమస్యల పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అన్నారు. బుధవారం 16వ వార్డులో కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి వారు క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. కృష్ణా కళాశాల రోడ్డు, భానునగర్, కేఆర్‌ఎం కాలనీ, హెచ్‌బీ కాలనీలో పలు సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ కమిషనర్ విజయలక్ష్మిని ఆదేశించారు. కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా నివారించాలన్నారు. భానునగర్‌లోని ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసి కంచె వేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో లోపం కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మేయర్, కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ లక్ష్మి పలు సమస్యలు తీసుకెళ్లారు. కుక్కల బెడద, భూగర్భ డ్రైనేజీ పొంగుపొర్లుతుందని చెప్పారు. అబ్దుల్ కలాం పార్కును ఆధునికీకరించాలని కోరారు. ఈ పర్యటనలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం రామ్‌నగర్‌లోని ఓమ్నీ ఆర్కే ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని ఆస్పత్రి డైరెక్టర్ అబ్బురెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గివ్ బ్లడ్, గివ్ ప్లాస్మా, షేర్ లైఫ్, షేర్ ఆఫెన్ అనే థీమ్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని తెలిపారు. ప్రతి ఆరు నెలలకోసారి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తం కొరత లేకుండా చూడాలన్నారు. ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. రక్త నిల్వలను లయన్స్ బ్లడ్ బ్యాంకుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు దామోదర్, సృజన్, బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు ఆత్మీయ వీడ్కోలు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఫ్లోరెన్స్‌కు ఇటీవల విజయనగరం జిల్లా వేపాడ బాలికల గురుకులానికి బదిలీ కావడం తెలిసిందే. ఆమె స్థానంలో ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బి.కె రమేష్‌ను నియమించారు. దీంతో ఫ్లోరెన్స్‌కు బుధవారం గురుకులం సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమెను విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయాధికారి(డీసీ) ఎస్.రూపావతి, అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాల్ టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు వాటి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి బుధవారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

జన్ భాగీదరిపై అవగాహన

ఎంవీపీ కాలనీ: పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం ఆవశ్యకతపై అవగాహన కలిగించేందుకు జన్‌భాగీదరీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎంవీపీ సెక్టార్ సూపర్ వైజర్ వినిషా సుందరి తెలిపారు. పెదజాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో జన్ భాగీదరిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల జీవితాల్లో మొదటి 6 ఏళ్లు కీలకమన్నారు. వారి అవసరాలు, ఎదుగులకు కావాల్సిన సదుపాయాలను అర్థం చేసుకుంటూ సంరక్షించాలన్నారు. ప్రాథమిక విద్యను పిల్లలకు ఇష్టమైన ఆటలు, పాటల ద్వారా అందించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవల్లిక, మల్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు చెల్లాయ్యమ్మ, దేవి, నాగలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



జలమయమైన శివాజీ పార్కు రోడ్డు

ఆరిలోవ/మద్దిలపాలెం: వేసవి ఎండలు, ఉక్కపోతతో మండిపోతున్న సమయంలో ఎట్టకేలకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో జనం ఉపశమనం పొందారు. ఓ పక్క ఎండ తీవ్రత, దాని నుంచి వచ్చిన వేడికి తట్టుకోలేక చల్లదనం కోసం ఇంట్లో ఏసీ, ఫ్యాన్లు వేసుకొని రోజంతా గడిపారు. ఎండలు ఎప్పుడు తగ్గుతాయోనని ఎదురు చూస్తున్న ఆరిలోవ జనాలకు వర్షం కురవడంతో చల్లని వాతావరణం కొంత ఊరటనిచ్చింది. ఎప్పటి నుంచో చెత్తతో పేరుకుపోయిన కాలువలు కూడా వర్షపు నీటితో శుభ్రమయ్యాయి. జీవీఎంసీ 22వ వార్డులో శివాజీపాలెం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట ప్రాంతాలలో రోడ్లు జలమయమయ్యాయి.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎంతో పాటు స్మార్ట్ సిటీ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి పేర్ల భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే దిశగా పని చేస్తోందన్నారు. పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనతో పాటు మధ్యాహ్నం భోజనం, యూనిఫాం సమకూర్చడం అభినందనీయమన్నారు.

సుందరయ్య కాలనీలో విద్యుత్ వెలుగులు


వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సుందరయ్య కాలనీలో ఎట్టకేలకు వీధి దీపాలు వెలిగాయి. ఈ కాలనీలో కొద్ది నెలలుగా ఎక్కువ సంఖ్యలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంది. దీంతో పాటు వెలిగిన పలు దీపాలు రాత్రి, పగలు నిరంతరం ఆరకుండా వెలుగుతూనే ఉండేవి. దీనిపై ఈనెల 12న 'వెలిగితే ఆరవు.. ఆరితే వెలగవు' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో రెండు రోజుల పాటు ఈ కాలనీలో వెలగని వీధి దీపాలను గుర్తించి తొలగించారు. వాటి స్థానంలో కొత్త బల్బులు అమర్చి వెలిగించారు. దీంతో పాటు నిత్యం వెలుగులు విరజిమ్ముతున్న దీపాలను సరిచేశారు. విద్యుత్ వెలుగులపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసన్నకుమార్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి మల్లారపు విజయ వెంకట ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. విభాగ ఆచార్యులు బి.సుజాత పర్యవేక్షణలో 'పారిశ్రామిక ప్రాంతాలలో పండిస్తున్న కంది, జొన్న పంటలలో కాడ్మియం హెవీ మెటల్ పరిమాణాన్ని శాస్త్రీయంగా గణించారు'. ఈ పరిశోధనకు వర్సిటీ డాక్టరేట్ అందించింది. మానవ, జంతువుల ఆరోగ్యంపై ప్రభావం చూపించే హెవీమెటల్స్ మనం తీసుకునే ఆహార పదార్థాల నుంచి మనం శరీరంలోకి చేరే అవకాశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు పురస్కారాలు


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట : పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు శ్రద్ధ అసోసియేషన్ పురస్కారాలు అందజేసింది. బుధవారం 20 మంది పిల్లలకు ఆర్థిక పురస్కారం, మరో 10 మంది పిల్లలకు కాలేజీ బ్యాగులను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద ద్వారా అందజేసింది. శ్రద్ధ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. సాగర శిరిజ మాట్లాడుతూ శానిటరీ ఉద్యోగుల పిల్లలు, సెక్యూరిటీ ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు, కాలేజీ బ్యాగులు అందజేశామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి. సమీర్ సౌరభ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న పిల్లలకు అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు బి. జగదీష్, కేజీహెచ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్. అప్పారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొన్నారు.

ప్యాలెస్ లేఅవుట్ చెత్తమయం


ప్యాలెస్ లేఅవుట్‌కు వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పరిధిలోని ప్యాలెస్ లేఅవుట్‌లో వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్యాలెస్ లేఅవుట్‌లో పలు ప్రాంతాలలో చెత్త పేరుకుపోయింది. రోడ్డు పక్కనే కుప్పలుగా వ్యర్థాలు, చెట్ల ఆకులు దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది సత్వరం స్పందించి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన దుర్గాలమ్మ ఉత్సవాలు


ఉయ్యాల కంబాలకు సిద్ధం చేస్తున్న భక్తులు

మధురవాడ: కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న చంద్రంపాలెం దుర్గాలమ్మ ఊరి పండగ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి అనుపు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవాయిద్యాలు, మేళ తాళాలు, సాము గరిడీలు, నేల డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఉయ్యాల కంబాల, ఉట్టి ఊపడం తదితర కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు సజావుగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, పోలీసు, జీవీఎంసీ అధికారులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు అన్యాయం


853వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 853వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే మాత్రం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

మహారాణిపేట: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇసుకతోట అర్బన్ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. దీని వల్ల మరొకరి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యుడు డాక్టర్ రమారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సినర్జీస్, ఐసీఐసీఐలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌తో పాటు సినర్జీస్ కాస్టింగ్స్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను కనీసం 50 శాతం మార్కులను పొంది ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్ కార్డులతో ఉదయం పది గంటలకల్లా శ్రామికనగర్‌లోని తమ కళాశాల ప్రాంగణానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

పోర్టు హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె

తాటిచెట్లపాలెం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రక్తదాత్ అమృత్ మహోత్సవ్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను వివరించారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో కొందరి ప్రాణాలను రక్షించిన వారమవుతామని పేర్కొన్నారు. శిబిరంలో రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తరచూ రక్తదానం చేసే వారిని గుర్తించి పోర్టు అధికారులు ఘనంగా సత్కరించారు. పోర్టులోని అన్ని విభాగాల సిబ్బంది రక్తదానంపై ప్రమాణం చేశారు. 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పోర్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషాదేవి, విభాగాధిపతులు, సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్, గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ సిబ్బంది, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి ప్రాణం మహాభారతం


మాట్లాడుతున్న వెంకట సత్యనారాయణ

సీతంపేట: ఆంధ్ర మహాభారతం తెలుగు సాహిత్యానికి ప్రాణమని, తెలుగు వారికి అమర కావ్యమని సాహితీవేత్త కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో 'కవిత్రయం-రచనా వైశిష్ట్యం' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. మహాభారతం కవిత్రయం వల్లే జనబాహుళ్యమైనదని తెలిపారు. తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా ప్రసిద్ధులైన నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్నలకు ఉన్న స్థానం అనన్యమైనదన్నారు. ముగ్గురూ మూడు సాహిత్య యుగాలకు యుగకర్తలుగా భావింపబడుతున్నారని పేర్కొన్నారు. తిక్కన్న చిత్రించిన యుద్ధ ఘట్టాలను చదువుతుంటే మహాభారత యుద్ధాన్ని సినిమా తెరకు ఎక్కించే ప్రయత్నం ఎవరూ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. మహాభారతం లోతు తెలుగు సినిమా దర్శకులకు అంతుబట్టలేదన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో లక్షకు పైగా శ్లోకాలు 18 పర్వాల్లో ఉన్నాయన్నారు. భారతం ద్వారా భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రాలు లభించాయన్నారు. రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ మహాభారతం ఆది కావ్యమని, తెలుగు వారి ఇళ్లల్లో ఉండవలసిన గ్రంథమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, బి.రాధారాణి, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


స్వామిని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: విద్యార్థినులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు సూచించారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో బుధవారం విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దిశ యాప్‌ను స్టూడెంట్లతో డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో మహిళల భద్రతకు దిశ యాప్ ఉపయోగపడుతుందని సీఐ అన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు.